సాక్షి
నిర్మల్
శనివారం । 2 । డిసెంబర్ । 2023



కూలీలకు 'ఉపాధి'

గ్రామాల్లో వలసలు నివారించి ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు ఉపాధిహామీ పథకం దోహదపడుతోంది. కూలీలకు పని దొరుకుతోంది.

9లో▸



అంగన్‌వాడీలకు భవనాలేవి?

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాల్లోనే అసౌకర్యాల మధ్య కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.1 /21.2

వాతావరణం

ఆకాశం కొంతమేరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూంకు తరలిన ఈవీఎంలు



భారీ భద్రత నడుమ ఈవీఎంల తరలింపు..

ముధోల్: ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం నిర్వహించిన పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలను శుక్రవారం జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. ముధోల్‌లోని సోషల్‌వెల్ఫేర్ పాఠశాలలో రాత్రి ఈవీఎంలను భద్రపర్చిన అధికారులు శుక్రవారం వాటిని జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ ఈవీఎంలతోపాటు ఎన్నికల సామాగ్రిని తరలించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని మూడు నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఈవీఎంలను పోలీస్ భద్రత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా మూడు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 3 ఆదివారం జరిగే ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి ఈవీఎంలను స్థానిక పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వు, కేంద్ర బలగాలతో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరిగిందన్నారు. కౌంటింగ్ సందర్భంగా 22 రౌండ్స్, 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



మంత్రి ఐకేరెడ్డితో న్యూవెల్మల్ నాయకులు

సోన్: సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిని వివరించారు. మంత్రి మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రిని కలిసినవారిలో మాజీ సర్పంచ్ తోట సాయన్న, మల్లయ్య, బాబుద్దీన్, రాజలింగం, చిన్నయ్య, భూమేష్ ఉన్నారు.

కూడికలు.. తీసివేతలు..!

- ఈవీఎంలలో ఓటరు తీర్పు
- పోలింగ్ అంచనాల్లో అభ్యర్థులు
- గెలుపోటములపై ఆరా..
- గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై సమీక్ష
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

నిర్మల్ ఖిల్లా:

నమస్తే సారు.. మన నిర్మల్ నియోజకవర్గంలో ఎట్లా ఉంటదంటరు.. ఎవరికి మెజారిటీ రావచ్చు.. ఏ పార్టీ గెలుస్తది.. ఓట్లు ఎటువైపు ఎక్కువ పడ్డయ్.. మీ అంచనా ఎట్లా ఉన్నది...అంటూ ఓ ఉపాధ్యాయుడికి యువరైతు ఫోన్ కాల్..!

అన్న ఎట్లున్నది..? అంటవే.. మీ ఊర్లో అయితే ఏ పార్టీకి ఓట్లు ఎక్కువ పడ్డాయి.. మన అధికారంలోకి వస్తది అంటావా.. మన సారు ఇగ ఎమ్మెల్యే అయినట్లేనా...?

ఖానాపూర్ నియోజకవర్గంలో తనకు తెలిసిన ఒక పరిచయస్తుడిని కలిసిన వ్యక్తి ఆరాతీస్తున్న తీరు ఇది..

ఇలా ఎక్కడ చూసినా,ఎక్కడ విన్నా... ఇదే రకమైన చర్చలు, ఫోన్లలో సంభాషణలు క(వి)నిపిస్తున్నాయి...

శాసనసభ ఎన్నికల పర్వంలో కీలక పోలింగ్ ఘట్టం గురువారం ముగిసింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా ప్రధాన పార్టీలు చివరి నిమిషం వరకు పోటాపోటీగా ప్రయత్నించాయి. అయితే ఈ సమయంలో వారు ఎంతవరకు సఫలీకృతమయ్యారనేది ఆదివారం తేలనుంది. నిర్మల్ జిల్లాలో ముధోల్, నిర్మల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల్లో ప్రధానంగా మూడు పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. అయితే ఇద్దరి మధ్య ఉత్కంఠ పోరు నెలకొన్నచోట్ల మూడో అభ్యర్థి ఎవరి ఓట్లు చీల్చారనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. మూడో తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు తీర్పు వెలువడనుంది. ఇప్పటికైతే ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విజయంపై గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

గెలుపుపై ప్రధాన చర్చ..

నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో విజయావకాశాలు ఏ పార్టీకి ఉన్నాయి.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలం.. అంతిమంగా విజయం ఎవరిని వరిస్తోందనే చర్చ కొనసాగుతోంది. ఎక్కడ ఏ ఇద్దరు కలిసిన ఇదే అంశంపై సంభాషిస్తున్నారు. ఇక ఫోన్లలో సైతం ఏయే మండలాల్లో ఏ పార్టీకి ఆధిక్యత రానుందనే అంశంపై చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు తమ తమ అంచనాల్లో మునిగితేలుతున్నారు. ఆయా నియోజకవర్గాలవారీగా పోలైన ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపోటములను బేరీజు వేస్తున్నారు. కూడికలు, తీసివేతలతో గెలుపు అంతరాన్ని అంచనా వేస్తున్నారు. ఓవైపు విజయం తమదేనని ధీమాను వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అంతర్గతంగా మాత్రం టెన్షన్ పడుతున్నారు.

ఇటు ఆశలు... అటు అంతర్మథనం..

గురువారం పోలింగ్ పూర్తయిన అనంతరం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కొన్ని పార్టీల్లో ఆశలు నింపగా.. మరికొన్ని పార్టీల అభ్యర్థులు అంతర్మదనానికి గురవుతున్నారు. నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో ద్విముఖపోరు, ఖానాపూర్ నియోజకవర్గంలో త్రిముఖపోరు ఉన్నట్లు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

ఎవరి లెక్కలు వారివే...

ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎవరికివారుగా నాయకులు తమకే విజయావకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని గ్రామాలు, మండలాలవారీగా సేకరించి తమకు వచ్చిన ఓట్లను అంచనా వేస్తున్నారు. ఏయే గ్రామాలు, మండలాల్లో ఎవరికి ఎంత శాతం ఓట్లు వచ్చాయనేది విశ్లేషించుకుంటున్నారు. గ్రామాల్లో మండల కేంద్రాల్లో, పట్టణాల్లో ఎక్కడ జనం గుమిగూడిన ఏ నాయకుడిని, కార్యకర్తను పలుకరించినా ఎవరు గెలుస్తారని చర్చనే కొనసాగుతోంది. గెలుపోటములపై ఆరా తీయడం వినిపిస్తోంది



పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో మంతనాలు జరుపుతున్న కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు

నమోదైన పోలింగ్ శాతాలు ఇలా..(వరుస అసెంబ్లీ ఎన్నికల్లో)

నియోజకవర్గం	2014	2018	2023
నిర్మల్	77.71	79.79	76.66
ముధోల్	79.24	84.47	80.54
ఖానాపూర్	74.32	80.87	77.46



సమాలోచనల్లో ముధోల్ అభ్యర్థులు

భైంసాటౌన్: జిల్లాలోనే అత్యధికంగా ముధోల్ నియోజకవర్గంలో పోలింగ్‌శాతం నమోదైంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రస్తుతం వారివారి నివాసాల్లో కార్యకర్తలతో కలిసి సమాలోచనలు చేస్తున్నారు. ఓవైపు పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను అభినందిస్తూనే, బూత్‌లవారీగా పోలింగ్ శాతం లెక్కలు తీస్తున్నారు. ఏయే స్థానాల్లో ఎంత పోలింగ్ నమోదైందోనని విజయావకాశాలను బేరీజు వేసుకుంటున్నారు. గెలుపుపై ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జనంలోనూ ఇదే ఆసక్తి...

మార్పు కావాలంటూ కాంగ్రెస్..... అభివృద్ధి కొనసాగాలంటూ అధికార బీఆర్‌ఎస్.. డబుల్ ఇంజన్ సర్కారుతోనే ప్రగతి సాధ్యం అంటూ బీజేపీ.. ఈ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేశాయి. జాతీయస్థాయి నుంచి మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు అగ్ర నేతలు అందరూ జిల్లాను చుట్టేశారు. అభ్యర్థులు సైతం రాత్రనకా పగలనకా సమయాన్ని వృథా చేయకుండా ప్రచార పర్వంలో ప్రజల మధ్యనే కనిపించారు. అయితే ఓటర్లు ఎవరిని ఆదరించారు.. ఎవరిని సాగనంపుతారు అనే చర్చ జనంలోనూ ఆసక్తి రేపుతోంది. ఆదివారం మధ్యాహ్నంలోపు ఫలితాలు వెల్లడి కానుండడంతో ఆ సమయం కోసం అభ్యర్థులతోపాటు జిల్లా వాసులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం



ప్రశంసాపత్రాలు పొందిన వైద్య సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ సేవలు జిల్లాలో విస్తృతంగా అందించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ బాధితులకు జిల్లా కేంద్రం, ఖానా పూర్, భైంసా ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీంతో వారి జీవన ప్రమాణాలు పెంచడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ బాధితులను ఆదరించాలని, వివక్ష చూపొద్దని కోరారు. కార్యక్రమంలో హెచ్ఐవీ, టీబీ, లెప్రసీ నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, సుమలత, ప్రదీప్, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ మాస్ మీడియా జిల్లా అధికారి రవీందర్. డీపీఎంవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత...

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని విధుల్లో ప్రతిభ కనబరిచిన వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో ప్రశంసాపత్రాలు అందజేశారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ రజని, డాక్టర్ సుమలత, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శుక్రుత్, హెడ్‌నర్స్ హేమలత, స్టాఫ్‌నర్సులు అన్నపూర్ణ, సోనీ, సంధ్యారాణి మిడ్ వైఫరీ సుజాత, గ్రామీణ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఐదు కళాశాలలకు సంబంధించిన విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూర్ ఎన్జీవో మేనేజర్ మల్లికార్జున్, లింక్ వర్కర్స్, ఐసీటీసీ కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

ఇక కొత్త మద్యం పాలసీ

- అందుబాటులోకి కొత్త వైన్ షాపులు
- జిల్లాలో తెరుచుకున్న 47 దుకాణాలు
- టెండర్ల ద్వారా రూ.20.38 కోట్ల ఆదాయం



నిర్మల్‌చైన్‌గేట్: రెండేళ్లపాటు కొనసాగిన మద్యం పాలసీ గడువు గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. పాత మద్యం దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు 75 శాతం రాకపోవడంతో ఇకపై ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారు. కొత్తగా దుకాణాలను సొంతం చేసుకున్న వారితో కొందరు వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నారు. మరికొందరు తమ అనుచరులు, పని చేసే వ్యక్తులతో టెండర్లు వేయించి దుకాణాలు దక్కేలా వేసిన ఎత్తుగడలు ఫలించాయి. మద్యం దుకాణాల్లో మళ్లీ లిక్కర్ కింగ్‌లదే పైచేయిగా మారింది. జిల్లాలో ఆగస్టు 21న నిర్వహించిన టెండర్లలో మొత్తం 1,019 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.20.38 కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి మద్యం దుకాణాలకు టెండర్లు రావడం ఆశ్చర్యం కల్గిస్తోంది. రోజురోజుకూ మద్యం వ్యాపారంపై చాలా మంది దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈసారి జిల్లా వ్యాపారులతో ఇతరులు కూడా టెండర్లు దాఖలు చేశారు.

బిజీ బిజీ...

జిల్లాలో కొత్త మద్యం దుకాణాలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. దీంతో గురువారం నుంచే హడావుడి మొదలైంది. 290 దుకాణాల్లో కొన్నింటిని ఆదే దుకాణాల్లో ఏర్పాటు చేసుకుంటుంటే.. మరికొన్ని దుకాణాలు కొత్తగా నిర్మాణం చేసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు అన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వ్యాపారులు ఆయా దుకాణాల నిర్మాణ పనులు చేస్తూ బీజీబీజీగా కన్పించారు.

లాభాలు ఉండటంతో..

మద్యం విక్రయాల వల్ల భారీగా లాభాలు ఉండటంతో మద్యం వ్యాపారులతోపాటు రాజకీయ నేతలు కూడా రంగప్రవేశం చేశారు. దుకాణం ఎవరి పేరుతో వచ్చినా అంతా కలిసే వ్యాపారం చేసుకోవాలని ముందుగానే ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో దుకాణానికి ఒక్కొక్కరు 10 మందికి పైగా బినామీ పేర్లతో దరఖాస్తు చేసుకున్నారు. వాళ్లలో ఏ ఒక్కరికి వచ్చినా అందరికీ లబ్ధి చేకూరేలా చేసుకున్నారు. మద్యం దుకాణాదారులే గ్రామాలు, వార్డుల్లో బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తుంటారు. ఇప్పటికే జిల్లాలో కోట్లలో వ్యాపారం సాగుతుండగా.. రానున్న రోజుల్లో విక్రయాలు మరింత పెరుగుతాయనే విశ్వాసంతో వ్యాపారులు ఉన్నారు.

1,019 దరఖాస్తులు...

మద్యం షాపులకు అబ్కారీశాఖ ఊహించినదానికంటే ఈసారి ఎక్కువ టెండర్లు వచ్చాయి. నిర్మల్ సర్కిల్లో 29 మద్యం దుకాణాలకు 729, భైంసా సర్కిల్‌లో 18 వైన్సులకు 290 టెండర్లు వచ్చాయి. మొత్తం 1,019 దరఖాస్తులకు 2 లక్షల చొప్పున మొత్తం రూ.20,38,00,000 ఆదాయం చేకూరింది.

పెరిగిన ఓటర్లు.. తగ్గిన పోలింగ్..!

- ఓటింగ్‌లో మహిళలే ముందంజ
- ఓటు వేయని థర్డ్ జెండర్లు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. గతంలో కంటే ఓటర్లు పెరిగినా పోలింగ్ శాతంలో మాత్రం పెరుగుదల కనిపించలేదు. ఇక, మహిళా ఓటర్లు సంఖ్యాపరంగానే కాకుండా ఓటింగ్‌లోనూ ముందంజలో ఉంటున్నారు. థర్డ్ జెండర్లు 18 మంది ఉండగా, ఒక్కరు మాత్రమే ఓటు వేశారు. 2018తో పోలిస్తే నియోజకవర్గంలో ఈసారి 32,770 మంది ఓటర్లు పెరిగినా.. పోలింగ్ శాతం మాత్రం 2018లో పోలిస్తే 3.95 శాతం తక్కువగా నమోదైంది. ఈ ప్రభావం మూడు ప్రధాన పార్టీలకు చెందిన ఎవరి గెలుపోటములపై పడుతుందో అన్న టెన్షన్ ఆయా పార్టీలో అభ్యర్థుల్లో నెలకొంది.

	2018	2023
మొత్తం ఓట్లు	2,16,784	2,49,554
పురుషులు	1,06,063	1,21,744
మహిళలు	1,10,705	1,27,792
ఇతరులు	16	18
పోలైన ఓట్లు	1,82,535	2,00,954
పురుషులు	87,916	97,961
మహిళలు	94,619	1,03,023
ఇతరులు	----	01
పోలింగ్ శాతం	84.49	80.54

ఓటరుకు సన్మానం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో స్థానిక పంచాయతీ పాలకవర్గం ఈఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకున్న వారిని అభినందించింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మల్లేశ్ అనే రైతు ఎలాంటి ప్రలోభాలకు లొంగక ఏ అభ్యర్థి గెలిస్తే ఏం చేస్తాడు అనే కోణంలో ఆలోచించి గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నాడు. దీంతో అతడిని సర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి, పంచాయతీ పాలక వర్గసభ్యులు సన్మానించారు.



ఓటరును సన్మానిస్తున్న పంచాయతీ పాలక వర్గం

ఓటింగ్.. లక్ష్యం చేరలే!

- గతఎన్నికల కంటే తక్కువగా నమోదు
- ప్రచారం చేసినా.. స్పందించని ఓటరు
- ముధోల్‌లో అత్యధికం.. నిర్మల్‌లోనే అల్పం
- ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన పల్లెలు
- పర్వాలేదనిపించిన పట్టణాలు
- ఓటు విలువను చాటిన గిరిజనం



నిర్మల్ రూరల్ మండలం వెంగాపేట్‌లో గురువారం ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు

నిర్మల్: జిల్లాలో ఓటర్లు ఈసారి పెద్దగా స్పందించలేదు. ఓటు వేయాలంటూ జోరుగా ప్రచారం చేసినా.. అధికారులు వేసిన అంచనాలను చేరుకోలేదు. కనీసం 2018 ఎన్నికల రికార్డునూ దాటలేదు సరికదా.. రెండుశాతం తక్కువే పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికలతో పోలిస్తే మాత్రం కాస్త మెరుగ్గా కనిపిస్తోంది. వందశాతం లక్ష్యంతో పోలింగ్ వెళ్లగా.. 78.67 శాతం వద్దే ఆగిపోయింది. కొన్ని మండలాలు, గ్రామాల్లో మాత్రం ఓటర్లు స్వచ్ఛందంగా ఓటేసేందుకు తరలివచ్చారు. పలు గ్రామాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం. నిర్మల్ నియోజకవర్గంతో పోలిస్తే అటవీ గ్రామాలు, సరైన రోడ్లు లేని ఖానాపూర్ నియోజకవర్గంలో కాసింత మెరుగైన ఓటింగ్ నమోదైంది. చాలావరకు అటవీ గ్రామాలు పోలింగ్‌ను బహిష్కరిస్తామని చెప్పినా.. మళ్లీ అధికారుల హామీలతో కేంద్రాలకు పోటెత్తారు. ఎన్నికల్లో ఏ అభ్యర్థి గెలుస్తారో.. ఎవరు ఓడుతారో.. ఆదివారం తేలిపోతుంది.

స్వచ్ఛందంగా వచ్చి...

గత ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి చాలామంది ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేశారు. చాలాచోట్ల అభ్యర్థులు, నాయకులు ఓటర్ల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయకున్నా.. వారే స్వయంగా వచ్చి తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడం కనిపించింది. స్వచ్ఛందంగా ఓటు వేయాలంటూ.. అధికారయంత్రాంగం, మీడియా, సోషల్ మీడియా చేసిన ప్రచార ప్రభావం చూపించింది. ఈవీఎంలు మొరాయించినా.. క్యూలైన్లు భారీగా ఉన్నా.. గంటల పాటు ఓపికతో నిల్చుని ఓటు వేశారు. సాధారణ ఓటర్లతోపాటు దివ్యాంగ ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేశారు.

పల్లెలే నయం..

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో ఎప్పటిలాగే పట్నం కంటే పల్లె ఓటర్లు ఆదర్శంగా నిలిచారు. ఈసారి కూడా పట్టణ ప్రాంతాల కంటే జిల్లాలోని పల్లెలలోనే పోలింగ్ శాతం అధికంగా కనిపించింది. చాలా గ్రామాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. మామడ మండలం రాశిమెట్లలో 95 శాతం, కుభీర్ మండలం సింగన్‌గాంలో 94.80 పోలింగ్ నమోదు కావడం విశేషం. దాదాపు ప్రతీ గ్రామంలో 75 శాతానికిపైగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం. నిర్మల్ అర్బన్ మండలంలోని చాలా కేంద్రాల్లో 60–65 శాతం ఉంటే.. అదే మండలంలోని ప్రతీ గ్రామంలో కనీసం 70–75శాతంగా పోలింగ్ నమోదైంది.

మహిళాశక్తిని చాటారు..

జనాభాలో నిష్పత్తిపరంగానే కాకుండా ఓటరు జాబితాలోనూ జిల్లాలో మహిళలే అధికంగా ఉన్నారు. మొత్తం జిల్లాలో 3,72,829 మంది మహిళ ఓటర్లు ఉండగా, 2,99,954 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈలెక్కన 72,875 మంది మహిళలు తమ ఓటును వేయలేదు. అదే పురుష ఓటర్ల విషయానికి వస్తే.. జిల్లాలో మొత్తం 3,50,509 మంది ఉండగా, కేవలం 2,69,242 మంది మాత్రమే ఓటువేశారు. మిగితా 81,267 మంది పోలింగ్‌కేంద్రం వైపు రాలేదు. ఇతరులు(ట్రాన్స్‌జెండర్స్) కూడా జిల్లాలో మొత్తం 51 మంది ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. వీరిలో కేవలం 17 మంది మాత్రమే ఓటు వేశారు. జిల్లా జనాభా, ఓటరు జాబితాలోనూ పైచేయిగా ఉండటమే కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవడంలోనూ మహిళలు శక్తిని చాటారు.

శ్రమకు ఫలం అంతంతే..

మూడు నెలలుగా జిల్లా అధికారులు, యంత్రాంగం చేసిన కృషికి తగ్గట్లుగా పోలింగ్ శాతం నమోదు కాలేదు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా సహాయ ఎన్నికల అధికారి, అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, స్వీప్ ఇన్‌చార్జి, డీఆర్డీవో విజయలక్ష్మితోపాటు రిటర్నింగ్ అధికారులు, వివిధ స్థాయిల అధికారులు, సిబ్బంది ఓటింగ్ శాతం పెంచడానికి నిర్విరామంగా శ్రమించారు. స్వీప్(సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ద్వారా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. రన్ ఫర్ ఓట్, వాక్ ఫర్ ఓట్, బతుకమ్మ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, మారుమూల గ్రామాల్లోనూ గ్రామసభలు పెట్టి అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా జిల్లా కేంద్రంలో 'ఐ విల్ ఓట్.. బికాస్ ఐ లవ్ నిర్మల్' అనే ప్రచార సెల్ఫీ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. ఇన్ని చేసినా పల్లె ఓటర్లు స్పందించినట్లుగా పట్నం ఓటర్లు స్పందించలేదు. దీంతో పోలింగ్‌శాతం అంచనాలను తగ్గట్లు నమోదు కాలేదు.

అటవీ గ్రామాలు ఆదర్శం..

హైదరాబాద్ వంటి మహానగరాలు, పట్టణాల కంటే మారుమూల అడవుల్లో ఉండే ఓటర్లు గ్రేట్. సరైన రోడ్లు, వెళ్లేందుకు వాహనాలు లేకున్నా.. కాలినడకన వెళ్లి తమ ఓటుహక్కును కాపాడుకున్నారు. ఎస్టీ రిజర్వుడు, అటవీ ప్రాంతాలున్న ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం, పెంబి, దస్తురాబాద్, ఖానాపూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, జన్నారం, సిరికొండ ప్రతీ మండలంలో 75–85 పోలింగ్ నమోదు కావడం విశేషం. ఇదే నియోజకవర్గంలోని గంగాపూర్, గుమ్మెన ఎంగ్లాపూర్ వంటి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు తమ సమస్యలు అందరికీ తెలిసేలా చేశారు. వాటిని పరిష్కరించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పారు. గుమ్మెన ఎంగ్లాపూర్‌లో పోలింగ్ రోజే వంటవార్పు పెట్టుకుని దూరంగా ఉన్నారు. చివరకు అధికారులు హామీ ఇస్తే ఓటేసేందుకు ముందుకు వచ్చారు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఉన్నా రాజ్యాంగం ఇచ్చిన ఓటుహక్కును మాత్రం కచ్చితంగా వినియోగించుకున్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని సారంగపూర్, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), ముధోల్ నియోజకవర్గంలోని కుభీర్, తానూర్ తదితర మండలాలలోని మారుమూల తండాలు, గూడేల ప్రజలూ ఇబ్బందికమైన పరిస్థితులను దాటుకోని పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటేశారు.

పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	మహిళలు	పురుషులు	పోలైన ఓట్లు	మహిళలు	పురుషులు	శాతం
నిర్మల్	2,53,309	1,20,365	1,32,925	1,95,757	1,06,602	89.143	77.28
ముధోల్	2,49,554	1,27,792	1,21,744	2,01,044	1,02,967	98,076	80.56
ఖానాపూర్	2,20,526	1,12,112	1,08,400	1,72,412	90,385	82,023	78.18
మొత్తం	7,23,389	3,72,829	3,50,509	5,69,213	2,99,954	2,69,242	78.67

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాట్లు
- స్ట్రాంగ్‌రూమ్ చేరిన ఈవీఎంలు
- ఓట్ల లెక్కింపు కోసం కట్టుదిట్టంగా చర్యలు



కౌంటింగ్‌కు సిద్ధమైన పాలిటెక్నిక్ కళాశాల

నిర్మల్: పోలింగ్‌ను ప్రశాంతంగా పూర్తిచేసినట్లే ఆదివారం కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేస్తోంది. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాలలోనే ఈసారి కూడా ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల ఓట్లను ఇక్కడే లెక్కించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను పక్కాగా చేస్తున్నారు.

స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎంలు..

ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే గురువారం రాత్రి వరకు పోలింగ్ సిబ్బంది పంపిణీ కేంద్రాలకు చేరుకుని, రిటర్నింగ్ అధికారులకు ఈవీఎం, వీవీప్యాట్లను అప్పగించారు. వీటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. నిర్మల్‌తోపాటు ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఈవీఎంలనూ ఇక్కడికే తీసుకువచ్చారు.

పక్కాగా ఏర్పాట్లు..

కౌంటింగ్ కేంద్రంలోకి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎవరినీ పంపించకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పోలీసులతోపాటు బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలతో బందోబస్తు చర్యలు చేపట్టారు. పాస్ ఉన్నవారినే అనుమతిస్తారు. ఈసారి పాసులు కూడా పరిమిత సంఖ్యలో జారీ చేశారు.

క్లుప్తంగా

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా(టి) గ్రామానికి చెందిన జంగం సంతోష్(37) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సంతోష్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన ఇంట్లో ఎవరు లేని సమయంలో నవంబర్ 29న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నరహరిగౌడ్(ఫైల్)

జైపూర్: జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన కొరకొప్పుల నరహరిగౌడ్(27) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. నరహరి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు స్వగ్రామమైన షెట్‌పల్లి గ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా పో లీసులు తెలిపారు. మృతుడికి 13 రోజుల పాప ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య


జ్యోతికతో సాయితరుణ్ సెల్ఫీ(ఫైల్)

జైపూర్: వారిద్దరూ ప్రేమించుకున్నారు. కులాలు వేరైనప్పటికీ పెద్దలను ఎదిరించి పెండ్లి చేసుకున్నారు. ఊహించని విధంగా ప్రేయసి మరణించింది. ఆ మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృత్యువాత పడిన సంఘటన షెట్‌పల్లిలో విషాదం నింపింది. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన ఆసంపల్లి సాయితరుణ్(22) ఇదే షెట్‌పల్లి గ్రామానికి చెందిన జ్యోతిక ఇద్దరూ ప్రేమించుకోగా కులాలు వేరుకావడంతో పెద్దలు అంగీకరించకపోవడంతో వారిని ఎదిరించి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. జ్యోతిక గర్భం దాల్చడంతో రక్తహీనతతో నెల కిందట ఆస్పత్రిలో మృతిచెందింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయితరుణ్ వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రి తరలించి వైద్యం అందించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడు నస్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సీసీసీలో నివాసం ఉంటుండగా మృతదేహాన్ని స్వగ్రామమైన షెట్‌పల్లికి తరలించారు. నెల రోజుల్లోనే ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరులా రోదించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

మంచిర్యాలటౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి పట్టణ వీధుల్లో శుక్రవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ ఎలా సోకుతుంది, నివారణ కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, వ్యాధి సోకిన వారికి అందిస్తున్న చికిత్స వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9840258899/ 9840468899 [H-793659]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462


బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్..


కాంగ్రెస్ ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి


అనుచరులతో స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి

కుటుంబ సభ్యులతో సరదాగా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా దాదాపు రెండు నెలల పాటు క్షణం తీరిక లేకుండా గడిపిన ఎమ్మెల్యే అభ్యర్థులు పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఇంటిపట్టున ఉండి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మమేకమై గెలుపే లక్ష్యంగా పనిచేసిన సదరు నాయకులు శుక్రవారం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. ఆ చిత్రాలే ఇవి..

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్/నిర్మల్


కుటుంబ సభ్యులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న


కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీహరిరావు నివాసంలో నాయకులతో మాట్లాడుతూ..


ఖానాపూర్ బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్


మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి


నాయకులతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


కార్యకర్తలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ముధోల్ అభ్యర్థి విఠల్‌రెడ్డి


కార్యకర్తలతో బీజేపీ ముధోల్ అభ్యర్థి పవార్ రామారావుపటేల్


పోలింగ్ వివరాలు పరిశీలిస్తున్న కాంగ్రెస్ ముధోల్ అభ్యర్థి భోస్లే నారాయణ్‌రావు పటేల్

ఓటింగ్‌పై ఆరా


కార్యాలయంలో అజ్మీరా శ్యాంనాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆరాధ్య దైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. గురువారం జరిగిన పోలింగ్ సరళిపై తెలుసుకున్నారు. ఆయా మండలాల్లో పార్టీకి పడిన ఓట్ల శాతంపై అంచనా వేసుకున్నారు. పార్టీకి అనుకూలంగా ఉండడంతో 40వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- రెండు నెలలు ప్రజల మధ్యలో నాయకులు
- ఎన్నికలు ముగియడంతో కుటుంబ సభ్యులతో సరదాగా

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు గత రెండు నెలలుగా ఎన్నికల ప్రచారం, వ్యూహాప్రతివ్యూహాలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. గురువారం పోలింగ్ ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. ఇంటికి వస్తున్న కార్యకర్తలు, నాయకులతో గెలుపోటములపై చర్చిస్తూనే కుటుంబానికి సమయం కేటాయించారు. రెండు నెలల కష్టాన్ని ఈ రెండ్రోజుల్లో మరిచిపోయేలా కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా కనిపించారు.

- మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన భార్య, కోడలు, మనవరాళ్లతో ప్రశాంతంగా గడుపుతూనే, ఎన్నికల సరళి ఏ విధంగా జరిగిందని నాయకులతో చర్చించారు.
- మంచిర్యాల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తన భార్య, ఇద్దరు కుమారులు, కోడలు, మనవరాళ్లతో సరదాగా గడిపారు.
- మంచిర్యాల బీజేపీ మంచిర్యాల అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి కుటుంబ సభ్యులందరితో శుక్రవారం సరదాగా గడిపారు.
- చెన్నూరు బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ అయ్యప్ప మాల ధరించి ఇంటికి వచ్చిన అయ్యప్ప స్వాములతో చర్చించారు.
- బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. అత్త, ఆడబిడ్డ, కూతుళ్లతో కులాసాగా గడిపి రాజకీయ వాతావరణం నుంచి కాస్త ఉపశమనం పొందారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థి అజ్మీర ఆత్మారాంనాయక్ శుక్రవారం గోలేటిలో పార్టీ కార్యకర్తలతో గెలుపోటములపై సుదీర్ఘ చర్చలు జరిపారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లు, గ్రామాల వారీగా పడిన ఓట్లపై చర్చించారు.

కాగజ్‌నగర్‌టౌన్:

- సిర్పూర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో తన నివాసంలో సమావేశం అయ్యారు.
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కోసినిలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గడిపారు. పలు కాలనీల్లో ఉన్న కార్యకర్తల నివాసాలకు వెళ్లి కలిశారు.
- బీజేపీ సిర్పూర్ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సర్‌సిల్క్‌లోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమయాన్ని గడుపుతూ కనిపించారు.


కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి


కుటుంబ సభ్యులతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు


కుటుంబ సభ్యులతో పాయసం తింటున్న శ్రీదేవి

- కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ అభ్యర్థి రావి శ్రీనివాస్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ స్కూల్ వెనుక ఉన్న ఆయన ప్లాంట్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమయాన్ని గడిపారు.

పోలింగ్ సరళిపై అంచనా


నాయకులు, కార్యకర్తలతో కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి శుక్రవారం తన నివాసంలో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. అనంతరం ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పోలింగ్ సరళిపై తెలుసుకున్నారు. ఏ మండలంలో పార్టీకి ఎంత శాతం ఓట్లు పడే అవకాశం ఉందని ఆరా తీశారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే బీఆర్‌ఎస్ విజయం ఖాయమని, 10వేల నుంచి 20వేలలోపు మెజార్టీతో విజయం సాధిస్తామని కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు.


పార్టీ నాయకులతో బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్పీ


అయ్యప్ప దీక్ష స్వాములతో మాట్లాడుతున్న చెన్నూర్ బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ దంపతులు


కుటుంబ సభ్యులతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


తన నివాసంలో మనుమరాలితో ముచ్చటిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


గోలేటిలో పార్టీ కార్యకర్తలతో చర్చిస్తున్న బీజేపీ అభ్యర్థి అజ్మీర ఆత్మారాం నాయక్


తన నివాసంలో కార్యకర్తలతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ హరీష్ బాబు


పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్

కేస్లాపూర్‌లో యువకుడి దారుణ హత్య


భీమిని: మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

భీమిని: పాత కక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిని కత్తితో దాడిచేసి హత్య చేసిన సంఘటన మండలంలోని కేస్లాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కేస్లాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు వెంకటి–లక్ష్మి దంపతుల మూడో కుమారుడు బొడ్డు జలేందర్(38) అదే గ్రామానికి చెందిన ముత్యం రాజశేఖర్‌గౌడ్‌ల మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో కోపం పెంచుకున్న రాజశేఖర్ శుక్రవారం రాత్రి భీమిని వైపు నుంచి కేస్లాపూర్‌కు వెళ్తున్న జలేందర్‌ను కేస్లాపూర్ గ్రామం పరిధిలోని హన్మాన్ ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడ్డాడు. విచక్షణరహిత్యంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా తెలిపారు. ఎస్సై ప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ సదయ్య బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య శారద, ముగ్గురు కూతుళ్లు మేఘన, మేనక, రక్షిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాతకక్షలు.. ప్రతీకార హత్యలు

ఆసిఫాబాద్: పాత కక్షలు రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన హత్యలు స్థానికంగా కలకలం సృష్టించాయి. పట్టణంలోని బెస్తవాడకు చెందిన బామ్మె శ్రీను(30), గుబుడె శ్రావణ్(45) హత్యలు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తవాడకు చెందిన బామ్మె శ్రీను కూలీ పని చేసుకుని జీవిస్తుండగా, అదే కాలనీకి చెందిన గుబుడె శ్రావణ్ చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కాలనీలో ఇద్దరి నివాసాలు దగ్గరదగ్గరే ఉన్నాయి. పాత కక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి తాగిన మైకంలో బామ్మె శ్రీను గొడ్డలితో గుబుడె శ్రావణ్ మెడపై దాడి చేశాడు. రక్తం మడుగులో కింద పడిపోయిన శ్రావణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దాడి చేసిన గొడ్డలి అక్కడే పడేసిన శ్రీను లొంగిపోయేందుకు పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరాడు. ఇది గమనించిన శ్రావణ్ కుమారుడు అనిల్ అక్కడి నుంచి శ్రీనును వెంబడించాడు. పట్టణంలోని గణేశ్ మందిర్ సమీపంలో రోడ్డుపై అదే గొడ్డలితో శ్రీను మెడపై నరకడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు హత్యల విషయం పట్టణంలో సంచలనం రేపింది. సమాచారం అందుకున్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని కారణాలు తెలుసుకున్నారు. పాత కక్షలతోనే హత్యలు జరిగినట్లు భావిస్తున్నట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. మృతుడు శ్రీనుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉండగా, శ్రావణ్‌కు ముగ్గురు కుమారులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్తపై కాంగ్రెస్ నాయకుల దాడి

- వాట్సాప్ వార్.. దాడికి దారితీసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ శ్రీరాముల సుజాత భర్త మల్లేష్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దాడికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే... మంచిర్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి శ్రీరాముల సుజాత పోటీ చేసి గెలిచింది. గెలిచిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరింది. పట్టణంలో జరిగిన ఓ విందు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ సుజాత భర్త మల్లేష్‌లు వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ టికెట్ మీద గెలిచి కౌన్సిలర్ అయి బీఆర్‌ఎస్‌లో చేరాడని కామెంట్ చేశారు. విందు కార్యక్రమం అనంతరం అందరూ వెళ్లిపోయారు. సాయంత్రం కాంగ్రెస్ నాయకులు మల్లేష్‌కు ఫోన్లు చేయడం, వాట్సాప్‌లో అసభ్యకరంగా మెస్సెజ్‌లు చేయడంతో మల్లేష్ సైతం అదే తరహాలో బదులిచ్చాడు. దీంతో ఇరువురి మధ్య కాసేపు వాట్సాప్ వార్ జరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు తోట తిరుపతి, బానేష్, మహేష్, కిషోర్ బాబు, రవిలు మరికొంత మంది సాయంత్రం మల్లేష్ ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న కుటుంబ సభ్యులపై సైతం దాడి చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజు, ఎస్సై రాజేందర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా...

మంచిర్యాలటౌన్: 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత భర్త శ్రీరాముల మల్లేశ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు మాట్లాడుతూ దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చట్టప్రకారంగా కఠిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. పోలీసులు వెంటనే తగిన చర్యలను తీసుకుని, మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా చర్యలను తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకుల ధర్నాతో గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేరుకుని దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింపజేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే అభ్యర్థిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావ్‌పై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 30న జరిగిన ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ విధించారు. కోడ్ ఉల్లంఘించి దివాకర్‌రావు తన అనుచరుతో కలిసి పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ నయిమ్ పాషా వీడియోతో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాడు. దీంతో దివాకర్‌రావ్‌తో పాటు మరో ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్యపై కేసు

నెన్నెల: బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. చిన్నయ్య గురువారం తన స్వగ్రామం జెండావెంకటాపూర్‌లో పార్టీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేశారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. స్పందించిన ప్రిసైడింగ్ అధికారి రాజశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు.